క్లుప్తంగా

ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీకి స్వయం ప్రతిపత్తి హోదా

పెనమలూరు: మండలంలోని గంగూరులో ఉన్న ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీకి స్వయంప్రతిపత్తి (అటానమస్) హోదా వచ్చిందని కాలేజీ చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్‌ఠాగూర్ మంగళవారం ప్రకటించారు. ఈ హోదా 2023–2024 విద్యా సంవత్సరం నుంచి అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకుల అనుభవం, సాంకేతిక, మౌలిక సదుపాయాల కల్పన మేరకు స్వయం ప్రతిపత్తి వచ్చిందని తెలిపారు. నేషనల్ ఎడ్యూకేషన్ పాలసీ ప్రకారం నూతన సిలబస్ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

తల్లిదండ్రులపై గురుతర బాధ్యత

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులను ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగటానికి తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పేరెంట్స్, ఉపాధ్యాయుల అసోసియేషన్ సమావేశం జరిగింది. నాగిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన పిమ్మట విద్యా వ్యవస్థలో గొప్ప మార్పులు తీసుకొచ్చారన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, జగనన్న కిట్లు ద్వారా పుస్తకాలు, దుస్తులు, టై, బెల్ట్, షూస్ ఉచితంగా అందజేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతి రోజూ స్కూల్‌కు పంపే బాధ్యత తీసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం వి.భూపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఎస్సార్కేలో మెగా జాబ్‌మేళా

రామవరప్పాడు: ఎనికేపాడులోని ఎస్సార్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈనెల 29న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు మంగళవారం తెలిపారు. వైజాగ్‌కు చెందిన ప్లేస్‌మెంట్ పార్క్ సంస్థ నిర్వహించే ఈ జాబ్ మేళాలో పలు బహుళ జాతి కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ (అన్ని బ్రాంచ్‌లు), డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నత ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.40 లక్షల నుంచి రూ.4.20 లక్షల వరకు వేతనం ఇస్తారన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో బుధవారం 8.30 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని హనుమాన్‌నగర్, సాయి నగర్, టెంపుల్ ఏరియా, ఫ్లెక్సైవర్ డౌన్, రైల్వేస్టేషన్ కట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం హనుమాన్‌జంక్షన్ పట్టణ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఏఈ ఎ.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గుడివాడ రోడ్డు, నూజివీడు రోడ్డు, ఇందిరా నగర్, ఐటీఐ రోడ్డు ఏరియాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని వినతి

కంకిపాడు: ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంపుదల చేయాలని అంగన్‌వాడీ హెల్పర్స్, వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చౌటపల్లి రవి కోరారు. కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు మండలాల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటపల్లి రవి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంపుదల చేయాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జూలై 10, 11 తేదీల్లో మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి తాడంకి నరేష్, ప్రాజెక్టు నాయకురాలు రేవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

ఉయ్యూరు: మండలంలోని కడవకొల్లు ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నోటు పుస్తకాలు అందజేశారు. దాత, ఎన్‌ఆర్‌ఐ బూరగడ్డ భాను ప్రతాప్ పుస్తకాలను ఎంఈఓ పద్మారాణి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రియాంక, హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జగనన్న కాలనీకి మార్గం సుగమం


వైఎస్సార్ జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు


ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం చేపట్టనున్న ప్రాంతం

గన్నవరం: నియోజకవర్గంలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో అతి పెద్దదైన మండలంలోని కేసరపల్లి లేఅవుట్లకు మార్గం సుగమం అయింది. ఈ కాలనీకి ప్రధాన రహదారి మార్గం కోసం ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు నిధుల విడుదలపై ప్రకటన చేశారు. ఈ వంతెన నిర్మాణం వల్ల వేలాది మంది జగనన్న కాలనీ లబ్ధిదారులతో పాటు పరిసర గ్రామాల రైతులకు మేలు జరగనుంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా కేసరపల్లిలోని ఏలూరు కాలువ పక్కన ప్రభుత్వ భూమితో పాటు రైతుల నుంచి 83.12 ఎకరాలు సేకరించారు. ఈ కాలనీలో ఏర్పాటుచేసిన ఐదు లేఅవుట్లలో ఎనిమిది గ్రామాలకు చెందిన 3,187 మంది లబ్ధిదారులకు నివేశన స్థలాలను కేటాయించారు. అతి పెద్దదైన ఈ కాలనీకి వెళ్లేందుకు ఏలూరు కాలువ గట్టు మినహా ప్రత్యామ్నాయ మార్గం లేదు. దీంతో లబ్ధిదారులకు దూరాభారం కావడంతో ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం కోసం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. పలుమార్లు సీఎంను కలిసినప్పుడు వంతెన నిర్మాణ ఆవశ్యకతను ఎమ్మెల్యే వివరించారు.

సీఎం సానుకూల నిర్ణయం

ఈ ప్రతిపాదనలపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూల నిర్ణయం తీసుకోవడంతో వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు నిధులు విడుదలయ్యాయి. దీంతో కాలనీకి రహదారి మార్గంపై నెలకొన్న సందిగ్ధత వీడింది. ఈ నిధులతో కేసరపల్లి శివారు అప్పారావుపేట వద్ద నుంచి జగనన్న కాలనీ వరకు ఏలూరు కాలువపై లోలెవల్ వంతెన నిర్మాణం చేయనున్నారు. ఇప్పటికే జగనన్న కాలనీలో ప్రధాన రహదారుల నిర్మాణం పూర్తి కావడంతో పాటు విద్యుత్ సరఫరా, తాగునీటి వసతులను అధికారులు కల్పించారు. దీంతో గృహ నిర్మాణాలు చేసేందుకు లబ్ధిదారులు పెద్దఎత్తున ముందుకు వస్తున్నారు. ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం కూడా పూర్తయితే గృహ నిర్మాణాలు మరింత వేగవంతమయ్యే అవకాశం ఉంది.

నెరవేరిన రైతుల దశాబ్దాల కల

ఈ వంతెన నిర్మాణం చేయనున్న స్థలంలో రైతులు, వ్యవసాయ కూలీలు పంట పొలాలకు వెళ్లి వచ్చేందుకు గతంలో ఏలూరు కాలువపై బల్లకట్టును నడిపేవారు. కొన్నేళ్ల క్రితం బల్లకట్టు మరమ్మతులకు గురై మూలనపడింది. అప్పటి నుంచి పొలాలకు వెళ్లేందుకు సుమారు నాలుగు నుంచి ఐదు కిలో మీటర్లు చుట్టూ తిరిగిరావాల్సిన పరిస్థితి. ఇక్కడ వంతెన నిర్మించాలని దశాబ్దాలుగా రైతులు చేస్తున్న విజ్ఞప్తులు బుట్టదాఖలవుతున్నాయి. ఈ నేపథ్యంలో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన వల్ల జగనన్న కాలనీ లబ్ధిదారులతో పాటు రైతులు, కూలీలకు ఎంతో ప్రయోజనం ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే వంశీ

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో వైఎస్సార్ జగనన్న కాలనీకి రహదారి మార్గం కోసం ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా కేసరపల్లి లేఅవుట్లలో తొమ్మిది గ్రామాలకు చెందిన 3,187 మంది పేద కుటుంబాలకు నివేశన స్థలాలు కేటాయించారని, సుమారు 83.12 ఎకరాల్లో అభివృద్ధి చేసిన ఈ లేఅవుట్‌కు సరైన రహదారి మార్గం లేక గృహ నిర్మాణ సామగ్రి తరలించేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే సానుకూలంగా స్పందించి ఏలూరు కాలువపై వంతెన, 60 అడుగుల రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి, సంబంధిత అధికారులకు లబ్ధిదారులందరి తరఫున ఎమ్మెల్యే వంశీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ బిల్ కలెక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు


ఎస్‌ఐ రాజేష్‌కు పూర్వ బిల్లు కలెక్టర్‌పై ఫిర్యాదు చేస్తున్న ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు

పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరు పంచాయతీ నిధులు స్వాహా చేసిన పూర్వ బిల్ కలెక్టర్ షేక్ షంషుద్దీన్‌పై ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్వ బిల్ కలెక్టర్ షేక్ షంషుద్దీన్ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశాడని పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ ఫిర్యాదు చేయటంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అధికారులు చేసిన విచారణలో బిల్ కలెక్టర్ షంషుద్దీన్ రూ.35,82,942 నిధులు దుర్వినియోగం చేశాడని నిర్ధారించారు. బిల్ కలెక్టర్ పరారీలో ఉండి, తన వద్ద ఉన్న రికార్డులను సైతం అప్పగించలేదు. దీంతో జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర్‌నాయక్ సీసీఏ నిబంధనల ప్రకారం బిల్ కలెక్టర్ షంషుద్దీన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసరావును ఆదేశించారు. దీంతో షంషుద్దీన్‌పై ఎస్‌ఐ రాజేష్‌కు ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు.

బడిఈడు పిల్లలందరినీ పాఠశాలకు పంపించండి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బడిఈడు పిల్లలందరినీ తల్లిదండ్రులు కచ్చితంగా పాఠశాలలకు పంపించాలని బాపులపాడు ఎంఈవో–2 బి.సురేష్ కుమార్ చెప్పారు. బాపులపాడు మండలం వీరవల్లి జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు, నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నారని చెప్పారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో ఆయన నేరుగా సంభాషించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. సమావేశానికి హాజరైన తల్లిదండ్రులకు రాగిజావ అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

30 మందికి సర్టిఫికెట్లు అందజేత

రామవరప్పాడు: బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రసాదంపాడు సత్యసాయి మందిరంలో గత 40 రోజులుగా జరుగుతున్న సెల్‌ఫోన్ రిపేరింగ్‌లో శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బ్రిడ్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా తమ తమ సొంత ప్రాంతాల్లోనే సెల్‌ఫోన్ రిపేర్ పాయింట్లు నెలకొల్పుకుని ఉపాధి పొందాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్‌కుమార్, ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ మల్లికార్జునరెడ్డి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శేషుకుమారి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమ ఇన్‌చార్జి నాగప్రసాద్, మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

నవరత్నాలు అమలు కమిటీ చైర్మన్ నారాయణమూర్తి


ప్రసంగిస్తున్న నారాయణమూర్తి

పెనమలూరు: పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని ఏపీ నవరత్నాలు అమలు కమిటీ చైర్మన్ అంకంరెడ్డి నాగ నారాయణమూర్తి సూచించారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధి పోరంకిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఆయన సమావేశం నిర్వహించారు. పేద వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని, వాటిపై అవగాహన కల్పించాలని నారాయణమూర్తి సూచించారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని కూడా గర్వంగా ప్రజలకు చెప్పాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో జగనన్న ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని, గత ప్రభుత్వంలా ప్రజలను మోసం చేయలేదని వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం అయ్యేలా ఉద్యోగులు, వలంటీర్లు కృషి చేసి ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మంచినేని రమేష్, నల్లమోతు జీవన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వెంటనే చెల్లించండి

పెనమలూరు: మండలంలోని తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో నివసించేవారు వెంటనే ఇంటి పన్నులు చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడత చెల్లించాల్సిన ఇంటి పన్నులకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి అపరాధ రుసుంతో పన్ను చెల్లించాల్సి వస్తుందని వివరించారు. నూటికి రూపాయి చొప్పున అపరాధ రుసుం ఉంటుందని పేర్కొన్నారు. ఇంటి యజమానులు వెంటనే పన్నులు చెల్లించాలని సూచించారు.

ఉయ్యూరు అభివృద్ధే అజెండా


అజెండాలోని అంశాలను పరిశీలిస్తున్న కౌన్సిలర్లు

ఉయ్యూరు: పట్టణ అభివృద్ధే అజెండాగా పనిచేస్తున్నామని ఉయ్యూరు మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ నాని అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో రహదారులు, డ్రెయిన్ల నిర్మాణంతో పాటు పలు అంశాలపై సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని పలువురు సభ్యులు కోరారు. చైర్మన్ వల్లభనేని మాట్లాడుతూ.. 20 వార్డుల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. డ్రెయిన్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేస్తున్నామన్నారు. అపరిష్కృతంగా ఉన్న డ్రెయిన్లను నిర్మిస్తున్న ఘనత తమ పాలకవర్గానిదే నన్నారు. అభివృద్ధితో పాటుగా ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలను కూడా ముందుకు తీసుకువెళ్లి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కమిషనర్ వెంకటేశ్వరరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం


తాతాపురం పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటరత్నం

రామవరప్పాడు: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాముఖ్యత ఇస్తోందని రూరల్ మండల విద్యాశాఖాధికారి ఆదూరి వెంకటరత్నం అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు తాతాపురం ప్రాథమిక పాఠశాల, రామవరప్పాడు ఎంపీయూపీ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. పాఠశాల విద్యాకమిటీలు, ఉపాధ్యాయులతో పలు అంశాలపై చర్చించారు. పాఠశాలలో ఏ విధంగా విద్యా బోధన చేస్తున్నారు, జగనన్న గోరుముద్ద పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.

సమ్మె నోటీసు ఇచ్చిన మునిసిపల్ కార్మికులు


కమిషనర్ ప్రకాశరావుకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక నేతలు

పెనమలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని తాడిగడప మునిసిపాలిటీలో పని చేస్తున్న కార్మికులు మంగళవారం సమ్మె నోటీసు ఇచ్చారు. మునిసిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావుకు ఈ సమ్మె నోటీసు అందజేశారు. మునిసిపాలిటీలో 450 మంది కార్మికులం పనిచేస్తున్నామని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే జూలై పదో తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించారు. వేతన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, ఈఎస్ఐ కార్డులు, దుస్తులు, చెప్పులు, సబ్బులు తదితర వస్తువులు ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని పేర్కొన్నారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో ఏపీ మునిసిపల్ వర్కర్స్ నేతలు షేక్ మస్తాన్‌వలి, ఉప్పాడ త్రిమూర్తి, టి.వెంకట్రావు, ఎం.కొండలరావు, టి.వెంకటరెడ్డి, రత్నకరుణ ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చంద్రశేఖరరావు, జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి

గన్నవరంరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు క్రమశిక్షణగా చదివి ఉన్నతంగా ఎదగాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి సూచించారు. గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం హెచ్‌ఎం కేఎస్ జగదీశ్వరరావు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. నాడు–నేడుతో పాఠశాలల దశ మారిందని, ఈ సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో విద్యార్థులు విజయకేతనాలు ఎగురవేశారని చెప్పారు. విద్యార్థులు చదువుకునే క్రమంలో పాటించాల్సిన జాగ్రత్తలను ప్రొఫెసర్ ఎ.చంద్రశేఖరరావు వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు మోరం నాగరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం

ఉయ్యూరు: దోమలు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్య చర్యలు చేపడితే వ్యాధులు దరిచేరవని మలేరియా అధికారి సర్వారాయుడు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్వారాయుడు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు వ్యాప్తిచెందవన్నారు. ఫ్రైడే డ్రైడే విధిగా పాటించాలని సూచించారు. మలేరియా, డెంగీ, ఫైలేరియా మొదలైన వ్యాధులపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, అంకిరెడ్డి, హెచ్‌ఎం శారద, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ తుమ్మల సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలను అపహరించిన వ్యక్తుల అరెస్ట్

ఉంగుటూరు: గొర్రెలు, మేకలను అపహరించిన వ్యక్తులపై ఉంగుటూరు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తరిగొప్పలకు చెందిన బొకినాల ప్రేమానందం, నిమ్మకూరు కిషోర్‌బాబులకు చెందిన మేకలు, గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ విషయమై ఉంగుటూరు పోలీసుస్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం రాత్రి కొందరు యువకులు మానికొండలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో వారిని విచారించగా వారు తరిగొప్పలలో రూ.50 వేల విలువగల గొర్రెలు, మేకల చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులు గన్నవరం మండలం బీబీ గూడెంకు చెందిన కిరణ్, దినేష్, వడ్డీకాసులుగా గుర్తించారు. అపహరించిన గొర్రెలు, మేకలను స్వాధీనపరచుకున్నారు. నిందితులు ముగ్గురూ 21 ఏళ్ల లోపు యువకులు కావడం గమనార్హం.

దాడి ఘటనపై కేసు

పెనమలూరు: మండలంలోని యనమలకుదురులో ఓ వ్యక్తిపై పలువురు దాడి చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. యనమలకుదురుకు చెందిన పి.రమేష్ బార్బర్‌షాపు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. అతను గతంలో గన్నవరంలో నివసించాడు. అప్పట్లో వెంకయ్య అనే వ్యక్తితో వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వెంకయ్య, రాజేష్, మరో ఇద్దరు కలిసి ఆదివారం రమేష్ ఇంటికి వచ్చి తగాదాపడి దాడి చేశారు. గాయపడిన రమేష్ విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సుపరిపాలనే జగనన్న సురక్ష లక్ష్యం


మంతెనలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్

కంకిపాడు: సుపరిపాలనే జగనన్న సురక్ష లక్ష్యమని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మండలంలోని మంతెన, తెన్నేరు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యం, ఇంటింటి సర్వేలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇచ్చారు. తహసీల్దార్ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవాలన్నారు. వారం రోజుల పాటు గ్రామంలో సర్వే నిర్వహించి సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించే రోజున ఆయా సేవలను ప్రజలకు సమర్థంగా అందించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు, ప్రభుత్వం నుంచి సేవలు సమర్థవంతంగా అందేలా చూడాలని కోరారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు వీరంకి వెంకట రమణ, జుజ్జవరపు ఎలీషా, ఎంపీటీసీ సభ్యులు బండి శ్రీనివాసరావు, ఉప్పలూరు శాంతి, మారేడుమాక సర్పంచ్ సీహెచ్ ఆదర్శకుమార్, సొసైటీ చైర్మన్ పటాకుల శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అత్తింటివారిపై వేధింపుల కేసు

పెనమలూరు: కట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. పోరంకి బ్రహ్మంగారి గుడి ప్రాంతానికి చెందిన పూసపాటి జ్యోతి, వెంకటేశ్వరరావు ప్రేమించుకుని రెండు సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. వెంకటేశ్వరరావు పెళ్లి తరువాత వ్యసనాలకు బానిసగా మారాడు. తనకు కట్నకానుకలు కావాలంటూ భార్యను వేధించసాగాడు. భర్తతోపాటు అత్త ఝాన్సీరాణి, మామ నాగేశ్వరరావు, ఆడపడుచు జ్యోతి, ఆమె భర్త కోటేశ్వరరావు వేధిస్తున్నారని జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.